www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 15 జూన్ 2024

జగన్‌ను కలిసిన వైసిపి యాదవ సంఘం నాయకులు

ప్రజాశక్తి- కడప అర్బన్

విజయవాడ తాడేపల్లిలోని వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి నివాసంలో జిల్లా వైసిపి నాయకులు, ఎమ్మెల్సీ ఆర్.రమేష్ యాదవ్, బిసి సెల్ జిల్లా అధ్యక్షులు బంగారు నాగయ్య యాదవ్, ప్రధాన కార్యదర్శులు కొప్పుల శివ యాదవ్, నేట్లపల్లి శివరామ్ కలిసి జిల్లాలో జరిగిన ఎన్నికల ప్రక్రియ తీరును వివరించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ కేడర్ ధైర్యంగా ఉండాలని, పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. 2029లో మనమే అధికారంలోకి వస్తామనే దీమా వ్యక్తం చేశారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం పైన ప్రజా క్షేత్రంలో పోరాడేందుకు వైసిపి శ్రేణులు సిద్ధంగా ఉండాలని తెలిపారు.

కోరలు చాస్తున్న కాలుష్యం

మేఘాలను తలపిస్తున్న పొగ
ఆర్‌టిపిపి నుంచి వ్యాప్తి
వ్యాధుల బారిన పడుతున్న ప్రజలు

ప్రజాశక్తి - ముద్దనూరు

ఆర్‌టిపిపి నుంచి వెలువడుతున్న పొగ వల్ల కాలుష్యం కొరలు చాస్తోంది. పొగ ఆకాశంలోకి వెళ్లి మేఘాలను తాకుతోంది. విద్యుత్తు ఉత్పత్తి జరిగే చిమినీల ద్వారా విపరీతమైన పొగ వ్యాప్తి చెందడంతో బూడిద, దుమ్ము ధూళి గాలిలో వ్యాపించి తీవ్ర కాలుష్యం ఏర్పడుతుంది. దీని వల్ల గాలి, నీరు వాతావరణం కాలుష్యమై పంటలు పాడై పోతున్నాయి. కాలుష్యం ధాటికి ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముద్దనూరు నుంచి ఆర్‌టిపిపి 9 కిలో మీటర్ల దూరంలో ఉన్నా ప్రజలు కాలుష్యం బారి నుంచి తప్పించుకోలేకున్నారు. ఆర్‌టిపిపిని ఆనుకుని ఉన్న చుట్టు పక్కల గ్రామాల పరిస్థితి మరింత దారుణంగా ఉన్నాయి. ముద్దనూరు నుంచి ఆర్‌టిపిపి మీదుగా ప్రొద్దుటూరుకు రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై నిలిపిన వాహనాలు, బైకులు దుమ్ముతో నిండుకుంటున్నాయని ప్రజలు వాపోతున్నారు. దుమ్ము ధూళి ఇళ్లల్లోకి చేరి పేరుకుపోతుందని దీంతో వ్యాధుల బారిన పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు. విపరీతంగా వెదజల్లుతున్న బూడిద వల్ల దుమ్ము, ధూళి పెరిగి వాతావరణం, నీరు, గాలి, పంటలు కాలుష్యమై అనారోగ్యం బారిన పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాతావరణం కాలుష్యం కావడంతో పంటలు పాడై జీవాలకు గడ్డి లేక అల్లాడిపోతున్నామని రైతులు, పశు పోషకులు బోరున విలపిస్తున్నారు. ఆర్‌టిపిపి నుండి వ్యాపిస్తున్న కాలుష్యాన్ని నివారించేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు

ఆర్‌టిపిపి పరిశ్రమ నుంచి వెలవడుతున్న కాలుష్యపు పొగ

కాలుష్యాన్ని నివారించాలి

దుమ్ము విపరీతంగా వెదజల్లుతుంది. దీని వల్ల నీరు, వాతావరణం కాలుష్యమవుతుంది. దుకాణంలో దుమ్ము పేరుకు పోతుంది. ఆరు బయట నిలిపే వాహనాలకు కమ్ముకుంటుంది. చాలా మంది అనారోగ్యానికి గురవుతున్నారు. అధికారులు తగిన చర్యలు చేపట్టాలి.

-ప్రశాంత్, స్థానికుడు.

నీరు కూడా కలుషితమవుతోంది

ఆర్‌టిపిపి నుంచి వెలువడే కాలుష్యం వల్ల వాతావరణం కాలుష్యం అవుతుంది. కాలుష్యమైన నీరు తాగడం వల్ల అనారోగ్యం బారిన పడాల్సి వస్తుంది. పిల్లలకు శ్వాస కోస, చర్మ సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. చెట్లు, ఇంట్లో వస్తువులపై దుమ్ము పేరుకు పోతుంది. అధికారులు స్పందించి కాలుష్యాన్ని నివారించాలి.

-విజయ పద్మజ, స్థానికురాలు

రవాణా, యువజన, క్రీడల శాఖా మంత్రిగా 'మండిపల్లి'

నేడు అన్నమయ్య జిల్లాకు రాక

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

రాయచోటి ఎమ్మెల్యే మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖా మంత్రిగా నియమితులయ్యారు. గురువారం సాయంత్రం ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు బాధ్యతలను స్వీకరించిన సంగతి తెలిసిందే. శుక్రవారం మధ్యాహ్నం తన కేబినెట్ సహచరులకు అర్హతల ఆధారంగా ఆయా శాఖలను కేటాయించారు. ముఖ్య మంత్రి శాఖలు కేటాయించిన అనంతరం రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం పొందిన మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తొలిసారిగా జిల్లా పర్యటనకు రానున్నారు. శనివారం మధ్యాహ్నం తిరుపతి జిల్లాలోని రేణిగుంట విమానాశ్రయం నుంచి పీలేరు మీదుగా అన్నమయ్య జిల్లాకు రానున్నారు. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ఉమ్మడి జిల్లాలోని టిడిపి కార్యకర్తలు, సహచరులు, అభిమానులు పెద్దఎత్తున స్వాగత సన్నాహాల్లో నిమగ్నం కావడం గమనార్హం.

భూ హక్కు చట్టం రద్దు హర్షణీయం

సమావేశంలో మాట్లాడుతున్న కడప బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుర్రప్ప

ప్రజాశక్తి - కడప

ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన మాటలు చంద్రబాబు నాయుడు నిలబెట్టుకున్నారని, అందరికీ నష్టం కలిగించే ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేస్తూ రెండవ సంతకం చేయడం హర్షణీయమని అన్నారు. శుక్రవారం జిల్లా కోర్టులోని కడప బార్ అసోసియేషన్ హాలులో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కడప బార్ అసోసియేషన్ అధ్యక్షులు గోగుల గుర్రప్ప మాట్లాడారు. భయానకమైన చట్టం ఎపి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ చట్టాన్ని గత వైసిపి ప్రభుత్వం తీసుకువచ్చిందని అన్నారు. ఈ చట్టాన్ని రద్దు చేయాలని న్యాయవాదుల సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ గత వైసిపి ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం చంద్రబాబు నాయుడు ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను రద్దు చేయడం సంతోషకరమన్నారు. విలేకరుల సమావేశంలో కడప బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పి. చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శి వైటిజే కెనడి, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ ఎన్. చిన్నయ్య, కోశాధికారి ఎం.వి. సుబ్బరామయ్య, లైబ్రరీ సెక్రటరీ నాగభూషణం, అసోసియేషన్ సభ్యులు, ఐఎల్ ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు సి. సుబ్రహ్మణ్యం, సీనియర్ న్యాయవాదులు, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకంచేస్తున్న లాయర్లు

టిడిపి లీగల్ సెల్ సంబరాలు

కడప అర్బన్ : తెలుగుదేశం ప్రభుత్వం ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు చేయడంతో ఆ పార్టీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. శుక్రవారం కోర్టు ఎదురుగా సీఎం చంద్రబాబు చిత్రపటానికి న్యాయవాదులు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శులు గోవర్దన్ రెడ్డి, హరి ప్రసాద్, న్యాయవాదులు పాల్గొన్నారు.

కడపను అభివృద్ధి చేస్తాం

మేనిఫెస్టో అమలుకు కృషి
వెన్నుపోటు దారులను పార్టీ నుంచి బహిష్కరిస్తాం
కడప ఎమ్మెల్యే మాధవి

ప్రజాశక్తి - కడప అర్బన్

వైసిపి పాలనలో అవినీతి, అక్రమాలు, భూ దందాలు జరిగాయని, అవినీతికి తావివ్వక నీతివంతమైన పాలనకు తెలుగుదేశం ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని కడప ఎమ్మెల్యే మాధవి పేర్కొన్నారు. శుక్రవారం ద్వారకా నగర్ లోని తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యేగా అంజాద్ బాషా అధికార దాహంతో నియోజకవర్గ అభివృద్ధిని నిర్వీర్యం చేశారని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహాయ సహకారాలతో ప్రజల సమస్యలు పరిష్కరించి, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పారు. చంద్రబాబు ఇచ్చిన హామీ ప్రకారం మెగా డిఎస్‌సిపై తొలి సంతకం, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశారన్నారు. నైపుణ్య గణన ద్వారా నైపుణ్యాన్ని పెంపొందించుకుని నిరుద్యోగులు ఉద్యోగాలు పొందొచ్చన్నారు. అన్నా క్యాంటీన్లు తెరుచుకుంటాయని అన్నారు. పేదలకు కూడు, గూడు, గుడ్డ అందించాలన్నదే తెలుగుదేశం లక్ష్యం అన్నారు. పార్టీలో ఉండి ఎన్నికల్లో పార్టీకి వెన్నుపోటు దారులను పార్టీ నుంచి బహిష్కరిస్తామని చెప్పారు. టిడిపి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం రద్దు చేసిన తెలుగుదేశం పథకాలన్నీ తిరిగి ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. జగన్ కులాల మధ్య చిచ్చు పెడితే, చంద్రబాబు నైపుణ్య గణన చేపట్టారన్నారు. తమను ఎక్కడి నుండో వచ్చారని, నోటికి వచ్చినట్లు మాట్లాడిన నోర్లకు ప్రజలు ఓట్లతో బుద్ధి చెప్పారని చెప్పారు. మేనిఫెస్టో హామీలన్నీ నెరవేర్చి, నగరాన్ని అభివృద్ధిలో పరుగులు తీయిస్తామని చెప్పారు. సమావేశంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు బాలిశెట్టి హరిప్రసాద్, గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. **పింఛన్ల సంఘానికి పూర్తి మద్దతు : ఎమ్మెల్యే ..**కడప నియోజకవర్గానికి నూతనంగా ఎమ్మెల్యేగా ఎన్నికైన రెడ్డప్ప గారి మాధవిని శుక్రవారం పాత కలెక్టర్ ఆఫీస్ వద్ద ఉన్న జిల్లా పెన్షన్ల సంఘం కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. సంఘం జిల్లా అధ్యక్షులు కె. చెన్నారెడ్డి, గౌరవ అధ్యక్షులు నాగ మునిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రామ్మూర్తి నాయుడు తమ సమస్యలను వారికి వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాధవి రెడ్డి మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ అధికారులుగా సేవలు అందించిన మీకు ఎటువంటి సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కమ్యూనిటీ హాల్ నిర్వహణ స్థలం సమస్య కొన్ని రోజుల్లోనే తీరుస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, పెన్షన్ల సంఘం నాయకులు అపూర్వ సుందరి, బిల్డింగ్ సొసైటీ అధ్యక్షులు కొండారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, పాలెం చంద్రశేఖర్, మల్లయ్య, సుభాన్, దేవరాజ్, నాగయ్య, నారాయణ, శంకరయ్య, సుబ్బయ్య, శ్రీనివాసులు, సుబ్బరాయుడు, సభ్యులు పాల్గొన్నారు. **రక్తదాన శిబిరం ప్రారంభం..** నగరంలో పిఎస్ డిజైన్, ఖున్ కా రిష్టా సంయుక్త ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ సర్కిల్ పిఎస్ డిజైన్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథిగా కడప ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవిరెడ్డి, టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానంతో ప్రాణాలు కాపాడవచ్చు అని తెలిపారు. రోగులు రక్తదానం వల్ల లబ్ధి పొందుతారని చెప్పారు. కార్యక్రమంలో పిఎస్ డిజైన్ అధినేత ఇంతియాజ్ అహ్మద్, ఖూన్ కా రిష్టా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ యం.తారిఖ్ అలీ, టిడిపి నగర ఉపాధ్యక్షులు పి.మన్సూర్ అలీ ఖాన్, రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ ఇన్‌ఛార్జి శ్రీను, ఖూన్ కా రిష్టా ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, రక్తదాతలు పాల్గొన్నారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

బక్రీద్‌ను శాంతియుతంగా నిర్వహించుకోవాలి : సిఐ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

బక్రీద్ పండుగను శాంతి యుతంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించుకోవాలని సిఐ ఈశ్వరయ్య ప్రజలను కోరారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ముస్లిం మత పెద్దలతో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భగా సిఐ మాట్లాడుతూ గోవధపై నిషేధం విధించారని, గోవులను అక్రమంగా రవాణా చేసినా, వధించినా చట్ట పరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. మతసామరస్యం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. ఏదైనా సమస్య ఉత్పన్నమైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. సమావేశంలో ఎస్ఐ చిరంజీవి,ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.**సింహాద్రిపురం** : గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసు కుంటామని ఎస్ఐ అనిల్ కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్ లో ముస్లిం మత పెద్దలతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బక్రీద్ పండుగ నేపథ్యంలో ముస్లిం సోదరులు రెచ్చగొట్టే వ్యాఖ్యలతోపాటు, సంఘటనలు చేయ రాదన్నారు. ఎక్కడ ఎలాంటి అసాంఘిక కార్య కలాపాలకు పాల్పడిన చర్యలు తీసు కుంటామన్నారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు. **కొండాపురం :** మండలంలోని ప్రజలు భారతీయ సంప్రదాయంగా వచ్చే పండుగలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సిఐ వి. వేణుగోపాల్, ఎస్ఐ పి. యోగేంద్ర అన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని హిందూ, ముస్లిం, క్రైస్తవ సోదరులకు పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పట్ల గౌరవం కలిగి ఉండాలని, అలాగే పండుగలు ప్రశాంతతతో నిర్వహించుకోవాలన్నారు. ఒకరి కొకరు సహకారం అందించుకుని జీవించాలని అన్నారు. ఎవరికైనా ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు

ఎల్లటూరి సాంబశివారెడ్డికి సన్మానం

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండలంలోని సోమిరెడ్డి పల్లె గ్రామానికి చెందిన టిడిపి నాయకులు ఎల్ల టూరి సాంబశివారెడ్డికి శుక్రవారం సోమి రెడ్డి పల్లె ఎస్‌సి కాలనీ వాసులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైదుకూరు నియోజవర్గ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ గెలుపు కోసం అహర్నిశలు కష్టపడి, ప్రతి పక్షంలోనూ ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నారని తెలిపారు. ఏ సమస్యలు వచ్చినా తాను ఉన్నా అంటూ గ్రామంలోని ఎంతో మందికి సాయం చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఊటుకూరు గంగిరెడ్డి, ఎల్లటూరు మల్లికార్జునరెడ్డి, ఓబుల్ రెడ్డి, ఎస్‌సి కాలనీ వాసులు చిట్వేలి ప్రతాప్, కలివేల సురేంద్ర, ఓబయ్య, జోజప్ప పాల్గొన్నారు.

ఎల్లటూరిని సన్మానిస్తున్న గ్రామస్తులు

మంత్రి వర్గంలో రాష్ట్రానికి, జిల్లాకు అన్యాయం : పిసిసి

ప్రజాశక్తి- కడప

మాట్లాడుతున్న తులసిరెడ్డి

కేంద్రమంత్రివర్గంలో రాష్ట్రానికి, రాష్ట్ర మంత్రివర్గంలో కడప జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగిందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ ఎన్. తులసి రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో రాబోవు రోజుల్లో కాంగ్రెస్ పార్టీ నిర్మాణాత్మక రాజకీయ పార్టీగా బాధ్యతాయుతంగా తన పాత్రను పోషిస్తుందని చెప్పారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, మంత్రులకు ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు. శుక్రవారం కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఏర్పడిన నూతన ప్రభుత్వంలో ప్రజలకు అన్యాయం జరిగితే నిర్మొహమాటంగా ఎత్తి చూపిస్తుంది అని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన ఐదు సంతకాలను కాంగ్రెస్ పార్టీ స్వాగతిస్తుంది అన్నారు. సంతకాలతోనే సరిపెట్టకుండా వాటిని శీఘ్రగతిన అమలు చేయాలని సూచించారు. రాష్ట్రంలో 2,50,000 ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయన్నారు. అందులో మెగా డీఎస్సీ ద్వారా 16,347 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసేందుకు మెగా డిఎస్‌సి ఫైల్ పై తొలి సంతకం చేయడం సంతోషమన్నారు. 25 పార్లమెంట్ సభ్యులు ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు 3 మంత్రి పదవులు ఇవ్వడం అన్యాయమన్నారు. రెండు ఎంపీలున్న జనసేనకు ఒక్క పదవి కూడా ఇవ్వలేదని వాపోయారు. కడప జిల్లాకు ఒక్క మంత్రి పదవి కూడా ఇవ్వలేదని వాపోయారు. అన్నమయ్య జిల్లాలో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేగా గెలిచి రాష్ట్ర మంత్రి అయిన మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి అభినందనలు శుభాకాంక్షలు తెలియజేశారు. కడప జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి గతం కంటే కొంతవరకు మెరుగైందని చెప్పారు. రాజకీయాల్లో జయ పజయాలు సహజమని, కాంగ్రెస్ నాయకులు నిరాశ, నిస్పృహకు లోను కావద్దని, ద్విగుణీకృత ఉత్సాహంతో పని చేద్దామని, ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేద్దామని తులసిరెడ్డి పిలుపునిచ్చారు. సమావేశంలో అబ్దుల్ సత్తార్, అబ్దుల్ ఖాన్, సలావుద్దీన్, వెంకటరమణారెడ్డి, డాక్టర్ శ్రీనివాసరావు, ఖాదిర్, కదిరి ప్రసాద్ గౌడ్, శ్యామలమ్మ, నాగరత్న, గౌడ్, రాజా చిన్న కుల్లయప్ప రమాదేవి మల్లికా బేగం వెంకటరమణ, సురేష్, ఉత్తన్న, అమర్, వినయ్ పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల అభివృద్ధికి సహకరించాలి

ప్రజాశక్తి - కడప

సన్మానం పొందుతున్న అధ్యాపకులు

కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకల సన్నాహక సమావేశం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల స్థాపించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు, కళాశాల ప్రిన్సిపల్ అధ్యక్షతన ప్లాటినం జూబ్లీ వేడుకల సన్నాహక సమావేశం ముగిసింది ముఖ్యఅతిథిగా విశ్రాంత ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ పి.వీరభద్ర రెడ్డి నేటి కాలపు విద్యా వ్యవస్థ గురించి ప్రసంగిస్తూ విద్యార్థులను, సహ సభ్యులను చైతన్యపరిచారు. కళాశాల అభివృద్ధికి సహకరించమని కోరారు. గౌరవ అతిథిగా విచ్చేసిన రిటైర్డ్ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఎఆర్ఎం రెడ్డి మాట్లాడారు. అనంతరం ఈ కళాశాలలో చదివి అధ్యాపకులుగా పనిచేసిన 9 మంది అధ్యాపకులకు కమిటీ సన్మానించింది. ఈ ఏడాది సెప్టెంబర్ 14 , 15, 16 తేదీల్లో నిర్వహించబోయే కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకలకు దేశవ్యాప్తంగా ఉన్న కళాశాల పూర్వ విద్యార్థులంతా హాజరు కావాలని ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ జి రవీంద్రనాథ్ పూర్వ విద్యార్థుల సంఘం కార్యదర్శి కె. శివరాం, కమిటీ సభ్యులను కోరారు. సమావేశంలో ఇంకా కళాశాల అధ్యాపక సిబ్బంది, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

కడప పేరును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

వైఎస్ఆర్ జిల్లా పేరు వైఎస్ఆర్ కడప జిల్లాగా మార్చాలని జిల్లా రచయిత సంఘం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కడప అన్న పేరు ఎంతో ప్రాచుర్యంలో ఉందని వేంకటేశ్వరుని తొలి గడపగా తిరిగి ప్రసిద్ధి పొందిందని తెలిపారు. 2022లో జిల్లా పునరుద్ధరణ సమయంలో ఈ పేరును మార్చారని జిల్లా ప్రజల భావాలకు విరుద్ధంగా గత ప్రభుత్వం మార్చిందన్నారు. తెలుగు శాసనం ఈ జిల్లాలో దొరికిందని ఎందరో ప్రాచీన కవులైన వేమన, బద్దెన, అన్నమయ్య, వీరబ్రహ్మేంద్రస్వామి, అష్టదిగ్గజ కవులలో ప్రసిద్ధులైన పెద్దన రామ రాజ భూషణుడు ఇంకా ఎందరో కవులు జిల్లాలో జీవించారన్నారు. జిల్లా ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తం చేశారన్నారు. ఇప్పటికీ ప్రజలు కడప పేరునే ఉపయోగిస్తున్నారన్నారు. కావున ప్రభుత్వం జిల్లా పేరును మార్చాలని విజ్ఞప్తి చేశారు.

రగిలే విప్లవ స్ఫూర్తి చేగువేరా : డివైఎఫ్ఐ

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

చేగువేరా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

యువతకు స్ఫూర్తి ప్రదాత రగిలే విప్లవ స్ఫూర్తి చేగువేరా అని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు.చేగువేరా జయంతి సందర్భంగా డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రొద్దుటూరులో చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ చేగువేరా యువతకు రోల్ మోడల్ అన్నారు. నేడు ప్రపంచం మొత్తం ప్రాంతాలకు, దేశాలకు అతీతంగా యువత ఆరాధిస్తున్న చేగువేరా పేరు "చే" అన్నారు. చేగువేరా పూర్తి పేరు ఎర్నెస్టోగువేరా అన్నారు. జూన్ 14, 1928 అర్జెంటినాలో జన్మించారన్నారు. చేగువేరా వైద్యుడని తాను దక్షిణ అమెరికాలో పేదలకు వైద్య సేవలు అందించే వారన్నారు. క్యూబా విప్లవం జయప్రదంలో చేగువేరా కీలక పాత్ర వహించారన్నారు. గెరిల్లా తరహా పోరాటంలో "చే" దిట్ట అన్నారు. అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడాడు అన్నారు. అందుకే ఆయన్ను యువత రోల్ మోడల్ గా ఆయన బొమ్మను టీషర్ట్, టోపీలు, పచ్చబొట్లు, బైక్‌లు పై బొమ్మలు వేసుకుంటున్నారు అన్నారు. ఆయన స్ఫూర్తితో రాబోవు రోజులలో మతోన్మాదానికి వ్యతిరేకంగా, ఉద్యోగం ఉపాధి కల్పన కోసం పోరాడుతామని పేర్కొన్నారు. కేంద్రంలో ఏర్పాటు అయిన బిజెపి ప్రభుత్వం విభజన హామీలు అమలు చేయాలి అన్నారు కార్యక్రమంలో ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్షుడు వెంకటేష్ నాయకులు విశ్వనాథ్,సన్నీ, అఖిల్, యువత పాల్గొన్నారు. **జమ్మలమడుగు రూరల్ :** యువతకు స్ఫూర్తి ప్రదాత రగిలే విప్లవ స్ఫూర్తి చేగువేరా అని డివైఎఫ్ఐ పట్టణ సహాయ కార్యదర్శి మహేష్ యాదవ్ తెలిపారు. చేగువేరా జయంతి సందర్భంగా డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక ఐటిఐలో జయంతి సభ నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ నాయకులు సుభహాన్, సూరి, రాఘవ, సతీష్, మహేష్, యువకులు పాల్గొన్నారు.

నాణ్యతకు చిరునామా జోయాలుక్కాస్

- మేయర్ సురేష్ బాబు

ప్రజాశక్తి - కడప అర్బన్

నాణ్యత, మన్నికకు చిరునామా జోయాలుక్కాస్ అని మేయర్ సురేష్ బాబు అన్నారు. శుక్రవారం కడప అంబేద్కర్ సర్కిల్ వద్ద నవీకరించబడిన షోరూంను పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోయాలుక్కాస్ వరల్డ్స్ ఫేవరెట్ జ్యూవెలర్ అన్నారు. ఆధునిక షోరూం, లక్షలాది డిజైన్స్‌తో కూర్చిన కలక్షన్స్, సాటిలేని సదుపాయాలు, గొప్ప కస్టమర్ సర్వీస్, జ్యూవెలరీ షాపింగ్ అనుభూతిని కల్పిస్తుందని పేర్కొన్నారు. జోయాలుక్కాస్ థామస్ మేధవ్ మాట్లాడుతూ వైభవోపేతమైన పునః ప్రారంభోత్సవ సందర్భంగా గోల్డ్, డైమండ్స్, ప్రెషస్, సిల్వర్ జ్యూవెలరీ అన్ని మజూరీ ఛార్జీలపై ఫ్లాట్ 50శాతం డిస్కౌంట్‌ను అందించడానికి జోయాలుక్కాస్ ఆనందిస్తోందన్నారు. కడపలో త షోరూంను పునః ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఇంతకు ముందు కంటే మరింత ఘనంగా ముందుకు వెళదామని పేర్కొన్నారు. అద్భుతమైన డిజైన్స్ శ్రేణి, సేవలు, నాణ్యతను కస్టమర్స్ మెరుగైన షాపింగ్ అనుభవం పొందవచ్చు అన్నారు. సినీ యాక్టర్ రేష్మ మాట్లాడుతూ కడప నడి ఒడ్డున షోరూమ్ ఉండడం ప్రజలకు గొప్ప అవకాశం అన్నారు. కొత్త కొత్త డిజైన్లను ఎంపిక చేసుకొని అనుభూతి పొందాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వ్యాపారవేత్త లక్ష్మీరెడ్డి, జోయాలుక్కాస్ సి ఓ ఓ హేన్రి జార్జ్, రీజినల్ మేనేజర్ రాజేష్ కృష్ణ, డీజీఎం హనీష్ వర్ జెసి, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

షోరూమ్‌ను ప్రారంభిస్తున్న మేయర్ సురేష్‌బాబు

ప్రధాన రహదారుల్లో పశువుల సంచారం

- ఇబ్బందుల్లో వాహనదారులు, పాదచారులు
- పట్టని అధికారులు

రోడ్లపై సంచరిస్తున్న ఆవులు

ప్రజాశక్తి-పులివెందులటౌన్
పట్టణంలో పశువులు ప్రధాన రహదారులపై సంచరిస్తూ పాదచారులను, వాహనదారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. కొంత మంది పశువుల యజమానులు వాటిని వదిలేయడంతో రోడ్లపైనే సేద తీరుతున్నాయి. పార్నపల్లె రోడ్డు, మారుతి థియేటర్ రోడ్ ఏరియాలో పదుల సంఖ్యలో పశువులు రోడ్ల పై సంచరించడమే కాకుండా అక్కడే తిష్టవేశాయి. పశువులు రోడ్డు పై ఉండడంతో పలుమార్లు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఇటీవల ప్రకృతి రెస్టారెంట్ సమీపంలో నడిచి వెళ్తున్న ఒక మహిళను ఆవు దాడి చేసి గాయం పరిచింది. కొద్ది రోజుల కిందట బైక్‌పై వెళుతున్న బార్య భర్తలకు ఆవు అడ్డు రావడంతో సడన్‌గా బ్రేక్ వేయగా కింద పడి గాయపడ్డారు. బైకు ,బ్యాగులలో ఉన్న వస్తువులను కూడా ధ్వంసం చేస్తున్నాయి. పార్నపల్లి బస్టాండ్, పూలంగల్ల సర్కిల్ , బిఎస్ఎన్ఎల్ కార్యాలయం తదితర ప్రాంతాలలో పశువులు సంచరిస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడమే కాకుండా మార్కెట్‌కు వచ్చే వారిపై కొమ్ములతో దాడి చేస్తూ భయబ్రాంతులకు గురి చేస్తున్నాయి. నిత్యం రోడ్లపైన పశువుల సంచారంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.. సంబంధిత అధికారులు, పశువుల యజమానులను ప్రజల ఇబ్బందులను గుర్తించి మళ్లీ రోడ్లపైకి పశువులను వదలకుండా చర్యలు తీసుకో చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. మున్సిపల్ అధికారులు, పోలీసులు, పశువుల యజమానులకు కౌన్సెలింగ్ నిర్వహించి పశువులు రోడ్ల పై సంచరించకుండా చర్యలు తీసుకోవాలని దుకాణదారులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తగు చర్యలు తీసుకుని ఈ సమస్యను పరిష్కరిస్తారని ఆశిద్దాం.

ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి

రాత్రి, పగులు తేడా లేకుండా రోడ్లపైనే తిరుగుతున్నాయి. దీనివల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. వాటి వల్ల ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. కొన్నిసార్లు వాహనాలు అదుపుతప్పి కింద పడుతున్నాం. తగిన చర్యలు తీసుకోవాలి

-రామ్మోహన్‌రెడ్డి, వాహనదారుడు, పులివెందుల

దుకాణం ముందే తిష్ట వేస్తున్నాయి

రాత్రి వేళ పశువులు మార్కెట్‌లో దుకాణాల ముందు పడుకుంటున్నాయి. ఎంత తోలినా మళ్లీ మళ్లీ ఇక్కడికే వస్తూ మా వ్యాపారాలకు ఇబ్బంది కలిగిస్తున్నాయి. కూరగాయల బుట్టలు కింద పడేసి తింటున్నాయి. వారసంత రోజు జనం ఎక్కువగా ఉండడంతో జనం మధ్యలో నుండి పశువులు వెళుతుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి వాటిని రోడ్లపైకి రాకుండా అధికారులు యజమానులపైచర్యలు తీసుకోవాలి.

-పుల్లయ్య, కూరగాయల వ్యాపారి

బిటెక్ రవికి పుష్పగుచ్ఛం అందిస్తున్న అధికారులు, కార్యకర్తలు

ప్రతి కార్యకర్తకూ న్యాయం చేస్తా : బిటెక్ రవి

ప్రజాశక్తి- పులివెందుల టౌన్
నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ కార్యకర్తలందరికీ సమచిత న్యాయం చేస్తానని మాజీ ఎమ్మెల్సీ టిడిపి పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి మా రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి (బీటెక్ రవి) అన్నారు. శుక్రవారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున చేరుకుని బీటెక్ రవిని కలిశారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావడంతో నియోజకవర్గంలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ ప్రజా సమస్యలు ఏమైనా అధికారుల వద్దకు వస్తే తక్షణమే వాటిని పరిష్కరించాలని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారమే పరమావధిగా భావించి అధికారులు పని చేయాలని సూచించారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి చేరుకొని బీటెక్ రవితో చర్చించారు. వారి వారి సమస్యలను వినతుల రూపంలో అందజేసి వాటిని పరిష్కరించాలని ఆయన్ను కోరారు. ప్రతి కార్యకర్తకు, ప్రజలకు ఏ సమస్యలున్నా వాటిని పరిష్కరిస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమాలలో విద్యుత్ అధికారులు ఇఇ శ్రీనివాసులు, ఎడిఇ గురు మోహన్ రెడ్డి, ఎడిఇ జయ సుధాకర్ రెడ్డి, ఎఇ మురళి, సబ్ ఇంజినీర్ కొండారెడ్డి, వివిధ సంఘాల నాయకులు అశోక్ బాబు, జయరామిరెడ్డి, రామిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు రఘునాథరెడ్డి, శివ మోహన్ రెడ్డి, నల్లగారి భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

పాలనలో మార్పు చూపించిన సిఎం

ప్రజాశక్తి - చాపాడు
సిఎంగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే పాఠశాలలు పునఃప్రారంభమైన రోజే పిల్లలకు పంచే కిట్ల పైన జగన్ ఫోటో ఉన్నా కూడా జగన్ మాదిరి కక్ష సాధింపులకు వెళ్లకుండా విద్యార్థులకు కిట్లు పంచమని సిఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారని జిల్లా టిడిపి అధికార ప్రతినిధి పి .మునిశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన కొన్ని హామీలను ప్రచారంలో ప్రజలకు చెప్పిన విధంగా తొలి సంతకం మెగా డీఎస్సీపై పెట్టి 16,340 పోస్టులు, ల్యాండ్ టైటిల్ చట్టం రద్దుపై రెండో సంతకం, పింఛన్ రూ. 4000 పెంచుతూ మూడో సంతకం, పేదలకు కడుపు నింపడానికి అన్న క్యాంటీన్లు పునఃప్రారంభం 4 సంతకం పెట్టి సీఎం ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. జగన్మోహన్ రెడ్డి మాదిరి కక్ష సాధింపులకు పోకుండా రాబోయే 5 సంవత్సరాలలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ నెంబర్ వన్ స్థానానికి తీసుకుపోవుటకు కృషి చేస్తారని ప్రజలకు తెలియజేస్తున్నామన్నారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు

ప్రజాశక్తి - ఖాజీపేట

బండ లాగుడు పోటీల్లో ఎడ్లు

మండలం పరిధిలోని తవ్వారు పల్లెలో భక్త వీరాం జనేయస్వామి ఆలయ 7వ వార్షి కోత్సవం సంద ర్భంగా శుక్రవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో భాగంగా లక్ష్మీ గణపతి హోమం, నవ గ్రహ పూజ కార్యక్ర మాలు ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు వనిపెంట లక్ష్మీ మధుసూదన శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ, సాయంత్రం భక్త వీరాంజనేయ స్వామివారి ఊరే గింపు కార్యక్రమాలు నిర్వ హించారు. ఈసందర్భంగా నిర్వహించిన బండ లాడుగు పోటీలు రసవత్తరంగా సాగాయి. గెలుపొందిన విజేతలకు ఆలయ కమిటీ ప్రతినిధులు బహు మతు లను అందజేశారు. పరిసర గ్రామాలనుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

జనసైనికులకు మంచిరోజులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మాట్లాడుతున్న జనసేన కో-ఆర్డినేటర్ నల్లంశెట్టి నాగార్జున

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జనసైనికులకు ఇక మంచిరోజులు వచ్చాయని జనసేన జమ్మలమడుగు కో-ఆర్డినేటర్ నల్లంశెట్టి నాగార్జున తెలిపారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లా డుతూ జనసేన అధినేత పవన్ కల్యాణ్ 21 అసెంబ్లీ, 2 పార్ల మెంటు స్థానాలను కూటమిలో తీసుకొని అన్ని స్థానాలను గెలవ డంతో జనసైనికులలో నూత నోత్సాహం వచ్చిందన్నారు. అందుకు తోడు పవన్ కల్యాణ్ మొదటిసారిగా ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే ఉప ముఖ్యమంత్రిగానే కాక పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీ, పర్యావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీ వంటి కీలక శాఖలు పొందడం అభినందనీయమన్నారు. మంత్రివర్గంలో నాదెండ్ల మనోహర్ కు ఆహారం, పౌరసరఫరాల శాఖ, కందుల దుర్గేష్‌కు పర్యాటక, సాంస్కృతిక శాఖ కేటాయించడం హర్షణీయమని తెలిపారు. జనసేన సిద్ధాంతాలకు తగ్గట్లు ఆయా శాఖలు దొరకడంతో రాష్ట్ర ప్రజలకు న్యాయం చేస్తారన్నారు. తమ అధినేత అడుగుజాడల్లో నడుచుకొని బాధ్యతగా మేలుగుతామని తెలిపారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

హామీల అమలులో మొదటి మెట్టు ఎక్కేశాం

- ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)
2024 ఎన్నికల్లో భాగంగా ఇచ్చిన వాగ్దానాలలో మెగా డిఎస్‌సిపై మొదటి సంతకం చేసి ఎన్నికల హామీలలో మొదటి మెట్టు ఎక్కేశామని ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మెగా డిఎస్‌సిపై ఆయన తొలి సంతకం చేశారని, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, రూ. 4వేలకు పింఛన్ పెంపు,అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, నైపుణ్య గణన ఫైళ్లపై మొత్తం 5 సంతకాలు చేశారని, త్వరలో మేనిఫెస్టోలో పొందుపరిచిన సూపర్ సిక్స్ పథకాలను కూడా అమలు చేస్తారని చెప్పారు. ప్రస్తుతం హౌసింగ్ డిపార్ట్‌మెంట్‌తో సమీక్ష నిర్వహించామని, నియోజకవర్గ వ్యాప్తంగా జగనన్న కాలనీలలో 23 వేల మంది లబ్ధిదారులకు ఇచ్చిన ఒక సెంటు ఇంటి స్థలంలో గృహాలు నిర్మించుకునేందుకు ముందుకు రాలేదని, త్వరలో అన్ని శాఖల అధికారులతో రివ్యూ సమావేశాలు నిర్వహించి ప్రొద్దుటూరు అభివృద్ధికి కావాల్సిన చర్యలు చేపడతామని చెప్పారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనులకు సంబంధించిన నిధులు ప్రస్తుతానికి పెండింగ్ ఉన్నాయని తన దృష్టికి వచ్చినట్లు, పెన్నా నదిపై నిర్మిస్తున్న ఆర్‌టిపిపి బ్రిడ్జి పనుల కాంట్రాక్టర్ తనను కలిసి దాదాపు రూ. 14 కోట్ల పనులకు సంబంధించిన నిధులు ఇంకా విడుదల కాలేదని చెప్పారన్నారు. అభివృద్ధి కోసం ఎంత మేరకు నిధులు అవసరమనే వివరాలు, అన్ని శాఖలతో సమీక్ష సమావేశాలు నిర్వహించి అసెంబ్లీ సమావేశాలలో తన గళం వినిపించనున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనులకు కావాల్సిన నిధులు తమ ప్రభుత్వంలో మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. గత వైసిపి ప్రభుత్వం అభివృద్ధి, ఉద్యోగ ఉపాధి అవకాశాలు ప్రజలకు దూరం చేసి కేవలం నవరత్నాలు మాత్రమే ప్రజలకు అందించారన్నారు. రానున్న రోజులలో వైసిపిని కాంగ్రెస్ పార్టీలో విలీనం చేసే దిశగా జగన్మోహన్ రెడ్డి అడుగులు వేస్తున్నారని ఆరోపించారు. 2029 నాటికి వైసిపిని రాష్ట్రంలో ప్రజలు మరిచిపోతారని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, కౌన్సిలర్ వంగనూరు మురళీధర్‌రెడ్డి, ఇ.వి. సుధాకర్ రెడ్డి, మాజీ పట్టణ అధ్యక్షుడు ఘంటసాల వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్ పుల్లయ్య కామిశెట్టి బాబు,చౌడం వెంకట కొండయ్య పాల్గొన్నారు.

కడబూర ప్రార్థనా మందిరం ప్రారంభం

ప్రజాశక్తి - కడప అర్బన్
నగర పరిధిలోని ఫకీరు పల్లెలో శుక్రవారం కడబూర ప్రార్థనా మందిరం ప్రారంభమైంది. ఇందులో పాస్టర్ డాక్టర్ ప్రసన్న కుమార్ రచించిన 'సజీవ దేవుని సరాగాలు' అనే స్తుతి గీతాల పుస్తకాన్ని పాస్టర్ డాక్టర్ పాల్ మోహన్ ఆవిష్కరిం చారు. కార్యక్రమంలో పాస్టర్ పాల్మో హన్ ,పాస్టర్ కె.రాజన్న, హరి డేవిడ్, లాయర్ యం. వరప్రసాద రావు, పాస్టర్ స్వర్జన్, రత్న కుమార్, సంఘస్తులు, విశ్వాసులు పాల్గన్నారు.

ట్రిపుల్‌ఐటిలో అరాచక పాలనకు స్వస్తి పలకాలి

ప్రజాశక్తి - వేంపల్లె
ఆర్‌జెయుకెటి పరిధిలోని ట్రిపుల్ ఐటిలో అధికారులు చేస్తున్న అరాచక పాలనకు నూతన ప్రభుత్వం స్వస్తి పలకాలని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి కాంట్రాక్టు అధ్యాపకులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ట్రిపుల్ ఐటిలో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులకు న్యాయం జరగాలన్నారు. 2017- 2018వ సంవత్సరంలోని అప్పటి టిడిపి ప్రభుత్వం పాలనలో విడుదల చేసిన నోటిఫికేషన్ ద్వారా ఆర్‌జెయుకెటి క్యాంపస్‌ల్లో చేరిన దాదాపు 200 మంది అధ్యాపకులను టిడిపి కార్యకర్తలు అంటూ వైసిపి ప్రభుత్వంలో ట్రిపుల్ ఐటి అధికారులు నిందించి ఐదేళ్లు ఎదుగుదల లేకుండా అణగదొక్కినారని తెలిపారు. కాంట్రాక్టు అధ్యాపకులకు ఇస్తున్న కనీస వేతనం రూ. 30వేలు ఏ మాత్రం సరిపోలేదన్నారు. ఎన్నో రకాలుగా తమ గోడు వెల్లడించినా వినపడనట్లు, కనపడనట్లు అధికారులంతా వ్యవహరించారని తెలిపారు. ధర్నాలు చేస్తే హడావిడిగా 110 పేరుతో అన్యాయపు జీవోను బలవంతంగా రుద్దేసి నామ మాత్రపు వేతన సవరణలు చేసి చేతులు దులుపుకున్నారని పేర్కొన్నారు. వీళ్లంతా టిడిపి పార్టీకి చెందిన వారని విద్యా శాఖకు చెందిన ఒక ఉన్నతాధికారి మాట్లాడటం అత్యంత దారుణమన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాలలో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులకు రూ. 57 వేలు వేతనం చెల్లిస్తున్నారని, మరి ట్రిపుల్ ఐటిలో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులకు మాత్రం రూ. 39 వేలు ఇవ్వడం బాధాకరమని తెలిపారు. చాలి చాలని వేతనాలతో పిల్లల చదువులు, తల్లితండ్రుల ఆరోగ్యాలు చూసుకోలేని దయనీయ స్థితిలో అర్జీయుకేటి కాంట్రాక్టు అధ్యాపకులు ఉన్నట్లు పేర్కొన్నారు. యూనివర్సిటీ అధికారులు ఛాన్సలర్ కెసి రెడ్డికి తొత్తులుగా పని చేస్తున్నారని తెలిపారు. కాంట్రాక్టు ఉద్యోగులు అందరూ ఆర్థికంగా నలిగి పోతున్నట్లు చెప్పారు. ఆర్‌జెయుకెటిని 5 సంవత్సరాలుగా దుర్మార్గపు పరిపాలన చేస్తూ విద్యా వ్యవస్థని భ్రష్టు పట్టిస్తున్న అధికారుల చేతుల నుంచి రక్షించాలని కాంట్రాక్టు అధ్యాపకులు కోరారు.

ఎస్ఆర్ఐటి, సిఇఎంఎస్ మధ్య ఒప్పందం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)
సాయి రాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం విశాఖపట్నం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ మారీ టైమ్ అండ్ షిప్ బిల్డింగ్ మధ్య ఒక అవగాహన ఒప్పందం కుదిరిందని ప్రిన్సిపల్ డాక్టర్ పాండురంగన్ రవి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఒప్పందం వల్ల విద్యార్థులకు అధ్యాపకులకు ఇంటర్న్‌షిప్, సర్టిఫైడ్ కోర్సులు, స్వల్ప కాలిక ప్రాజెక్టులు, వర్క్ షాపులు, ప్లేస్మెంట్ సహాయం, విద్యా కార్యక్రమాల ద్వారా ప్రయోజనాలు పొందుతారన్నారు. కరస్పాండెంట్ కళ్యాణ్ రెడ్డి మాట్లాడుతూ కళాశాల ఈ ఒప్పందంతో మరో మైలురాయి చేరుకుం టుందన్నారు. రాయలసీమలోనే మొత్తం మొదటిసారిగా తమ కళాశాల ఒప్పందం చేసుకోవడం గర్వించదగ్గ విషయం అన్నారు. ఈ ఒప్పంద కార్యక్రమంలో చీఫ్ ఎగ్జిక్యూటివ్ కె.సేతు మాధవన్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ గోపీకృష్ణ శివమ్, కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, కళాశాల సెక్రటరీ కార్యదర్శి వీర కళ్యాణ్‌రెడ్డి, విద్యార్థులు, అధ్యాపకులు హెచ్‌ఒడిలు పాల్గొన్నారు.

రక్తదానం చేద్దాం.. ప్రాణాలను నిలుపుదాం

రక్తదాతను అభినందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి-కడప
ఇంటికి ఒకరు రక్తదానం చేద్దాం ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడుదాం అని కాంగ్రెస్ పార్టీ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు చెప్పలి పుల్లయ్య, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ ఎన్. తులసి రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కడప ఎమ్మెల్యే అభ్యర్థి అఫ్జల్ ఖాన్ అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు చెప్పలి పుల్లయ్య అధ్యక్షతన జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు.అన్ని దానాల్లో కన్నా రక్తదానం గొప్పదని అన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ పార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు మామిళ్ళ నరసింహులు, కార్మిక విభాగం కమలాపురం అధ్యక్షుడు అశోక్ రావు, జిల్లా కార్యదర్శి యశ్వంత్, యువ నాయకులు రషీద్ ఖాన్, సునీల్, వినయ్ కుమార్, శీను, మరికొందరు రక్తదానం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అఫ్జల్ ఖాన్, సలావుద్దీన్, రమణరెడ్డి, కులయప్ప, శ్యామలాదేవి, సుజాత రెడ్డి, కార్మిక నాయకులు అరుణ్ కుమార్, విక్కీ, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుశీల్ కుమార్, అమర్, ఉత్తన్న, రాజా, బాబు, పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. **రాయల్ కరీముల్లాకు సన్మానం** రక్తదాన ప్రచార సేవ కు సత్కారం. రక్త దానం చేయండి ప్రాణదాతలు కండి అనే కరపత్రాలతో ప్రజలకు యువతకు విద్యార్థులకు పంచుతూ రక్తదానంపై ప్రచారం చేస్తున్న ఇండియన్ రెడ్‌క్రాస్ సభ్యులు, రాయల్ రషీద్ అసోసియేషన్ అధ్యక్షులు అబ్దుల్ షేక్ రాయల్ కరీముల్లానురక్తదాతల దినోత్సవం సందర్భంగా స్టెప్ సీఈఓ సాయి గ్రేస్, రెడ్ క్రాస్ స్పెషల్ ఆఫీసర్ శివశంకర్ ఘనంగా సత్కరించి జ్ఞాపకం బహుకరించారు. **పులివెందుల టౌన్ :** రక్తదానం చేసేందుకు యువత స్వచ్ఛందంగా ముందుకు రావాలని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మల్లీశ్వరి అన్నారు. శుక్రవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని డాక్టర్ వైఎస్ఆర్ సర్వజన ఆసుపత్రిలోని రక్తనిధి కేంద్రంలో ఏర్పాటు చేసిన శిబిరంలో యువకులు రక్తదానం చేశారు. దివ్య డెంటల్ క్లీనిక్ డాక్టర్ అనూప్ రెడ్డితో పాటు 20 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేసిన యువకులను సర్వజన ఆసుపత్రి డాక్టర్ మల్లీశ్వరి, ప్రొఫెసర్ డాక్టర్ వరలక్ష్మి, రక్తనిధి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గీతిక, డాక్టర్ నాహిద్ ప్రశంసా పత్రాలు అందజేసి రక్తదాతలను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్, హెడ్ నర్సులు, రక్తనిధి సిబ్బంది పాల్గొన్నారు. **కడప అర్బన్ :** రక్తం కొరత ఎలాంటి ప్రాణహాని చోటు చేసుకోకూడదని జెబివిఎస్ ది ప్రిజర్వేర్ సేవ సమితి వ్యవస్థాపకులు అశోక్ అన్నారు శుక్రవారం సేవా సమితి, సమారిటన్ ఛారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో బాలాజీ నగర్ యూత్ హాస్టల్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతోమంది అనారోగ్యులు, తలసేమియా వ్యాధిగ్రస్తులు, గర్భిణులు రక్తం కొరత వల్ల ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు రక్తదానం చేయడానికి నడుంబిగించాలన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్స్ సురేంద్ర, వరప్రసాద్, శ్రీకాంత్, రక్తదాతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. **28వ సారి రక్తదానం చేసిన పవన్ కుమార్** ప్రపంచ రక్తదాతల దినోత్సవం పురస్కరించుకుని కడప రిమ్స్ బ్లడ్ బ్యాంకులో బ్లడ్2లివ్ వ్యవస్థాపకులు పట్టుపోగుల పవన్ కుమార్ 28వ సారి స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా పవన్ కుమార్ మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉన్న యువతీ, యువకులు ప్రతి మూడు నెలలకు ఒకసారి స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని కోరారు. 17 సంవత్సరాలుగా తాను అడిగిన వెంటనే రక్తదానం చేసి వెలకట్టలేని ప్రాణాలను కాపాడిన ప్రతి ఒక్కరికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

రక్తదానం చేస్తున్న పవన్‌కుమార్

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న రాచమల్లు ప్రసాద్‌రెడ్డి

'చావునూ రాజకీయం చేయడం టిడిపికే చెల్లు'

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు
మాజీ ముఖ్యమంత్రి జగన్‌పై అపారమైన అభిమానం కలిగి పరువుకు పోయి బలవన్మరాణానికి పాల్పడ్డ వైసిపి క్రియాశీల కార్యకర్త సుబ్బారావు గురించి తాము బాధపడుతూంటే చావును కూడా రాజకీయానికి వాడుకోవడం తెలుగుదేశం పార్టీ నాయకులకే చెల్లిందని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి అన్నారు. స్థానిక పోరెడ్డి నరసింహారెడ్డి ఇంటిలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుబ్బారావు మృతి తనలో దుఖాన్ని కలిగించాయన్నారు. బలవన్మరణానికి పాల్పడే ముందు రాసిన లేఖలో 'నా అంతిమయాత్రకు జగన్ వచ్చేలా చూడండి' అని రాశాడంటే దుఃఖం ముంచుకొస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా రాచముల్ల సమావేశంలో లేఖను ప్రదర్శిం చారు. ఈ ఓటమినిని తమతో సుబ్బారావు పంచుకొని ఉంటే ఇంత దాక వచ్చేది కాదన్నారు. తనతో మాట్లాడి ఉంటే మనసు మార్చి ఉండేవాణ్ని అన్నారు. స్థానికంగా అభివృద్ధి ఓడి అపద్ధం గెలిచిందన్నారు. సుబ్బారావు అప్పు తనకు ఇచ్చారని ఈ అప్పు తీర్చకపోవడం వల్ల మృతి చెందాడని టిడిపి నాయకులు అపద్దాన్ని ప్రచారం చేస్తున్నారన్నారు. శవంపై పేలాలు ఏరుకునే విధానం అంటే ఇదే అన్నారు. సుబ్బారావు కుటుంబాన్ని తప్పకుండా ఆదుకుంటామన్నారు. సమావేవంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారెడ్డి, కౌన్సిలర్లు వరికూటి ఓబులరెడ్డి, భూమిరెడ్డి వంశీదర్‌రెడ్డి, గరిశపాటి లక్ష్మీదేవి, పోరెడ్డి నరసింహారెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి- చక్రాయపేట
220 కెవి చక్రాయపేట సబ్ స్టేషన్, 33 కెవి చక్రాయపేట ఫీడర్ పరిధిలో టవర్ల నిర్మాణంలో భాగంగా శనివారం ఉదయం 8:15 గంటల నుండి 12 . 15 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నామని ఎఇఇ ప్రవీణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కనుక పైన తెలిపిన సమయంలో చక్రాయ పేట, మహాదేవపల్లి, కె.రాజుపల్లి, కె.ఎర్రగుడి గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

పులివెందుల రూరల్ : పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టామని, చెత్తను రోడ్లపై వేయరాదని, చెత్త వాహనాలలో వెయ్యాలని కమి షనర్ రమణారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. పట్టణంలో రోజూ మంచినీటి సరఫరా జరిగేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. పైప్‌లైన్ లీకేజీల ద్వారా నీటి వృథాను అరికట్టాలన్నారు. ఇంటి ంటి చెత్త సేకరణ కార్యక్రమాన్ని మరింత మెరుగు పరచడానికి చర్యలు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్, టౌన్ ప్లానింగ్ అధికారి అజయ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి : ఎంఇఒ

ప్రజాశక్తి - సింహాద్రిపురం

బాధ్యతలు చేపడుతున్న ఎంఇఒ

మండలంలో విద్యాభివృద్ధికి కృషిచేసి విద్యార్థులను ఉన్నత స్థాయికి ఎదిగేలా చర్యలు తీసుకుంటానని మండల విద్యాశాఖ అధికారి ఓబులేసు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని విద్యాశాఖ కార్యాలయంలో మండల విద్యాశాఖ అధికారి-1గా బాధ్యతలు స్వీకరించారు. ఆయన కొండా పురం నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంఇఒ శ్రీనివాసులు లింగాలకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండ లంలో విద్యార్థులకు చక్కని బోధన అందేలా చర్యలు తీసుకుం టామన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేలా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 శారద, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

OFFICE OF THE RECOVERY OFFICER-I/II DEBITS RECOVERY TRIBUNAL HYDERABAD (DRT 2) 1st Floor, Triveni Complex Abids, Hyderbad 500001

DEMAND NOTICE
NOTICE UNDER SECTION 25 TO 28 OF THE RECOVERY OF DEBTS & BANKRUPTCY ACT, 1993 AND RULE 2 OF SECOND SCHEDULE TO THE INCOME TAX ACT, 1961

RC/297/2019 **24-04-2024**

State Bank of India
Verses
Modem Srinivasulu Srinivasa Rao And Another

To
(CD 1) Sri Modem Srinivasulu @ Srinivasa Rao S/o Late Venkata Subbaiah, D No.3/78, Brahman Street, Siddavattam, YSR Cuddapah-516 237, A.P.

(CD 2) S Srinivasulu
Occ: Asst Divisional Engineer, O/o Occ, Sub Division, A.P.S.P.D.C.L, YSR Cuddapah District, A.P.

This is to notify as per the Recovery Certificate issued in pursuance of orders passed by the presiding Officer, DEBTS RECOVERY TRIBUNAL HYDERABAD (DRT2) in OA/486/2017 an amount of Rs.3044938.00 (Rupees Thirty Lakhs Forty Four Thousands Nine Hundred Thirty Eighty Only) along with pendentellite and future interest @ 10.25% simple interest year w.e.f. 09.04.2019 till realization and costs of Rs O (Only) has become due against you (jointly and severally/Fully/Limited).
2. You are hereby directed to pay the above sum within 15 days of the receipts of the notice, failing which the recovery shall be made in accordance with the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 and Rules there under.
3. You are hereby ordered to declare on an affidavit the particulars of yours assets on or before the next date of hearing.
4. You are hereby ordered to appear before the undersigned on 19/06/2024 at 10.30 a.m. for further proceedings
5. In addition to the sum aforesaid, you will also be liable to pay.
(a) Such interest as is payable for the period commencing immediately after this notice of the certificate / execution proceedings.
(b) All Costs, charges and expenses incurred in respect of the service of this notice and warrants and other processes and all other proceedings taken for recovering the amount due.
Given under my hand and the seal of the Tribunal, on this date:24/04/2024

Recovery Officer-I
Debts Recovery Tribunal Hyderabad (DRT2)

పత్రికా ప్రకటన

పంచాయితిరాజ్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంటుకు అద్దె వాహనాలు సమకూర్చుకొనుటకు టెండరు పిలువబడును.

వివరాలు ఆఫీసరు పేరు	తిరిగే ప్రాంతము	షెడ్యూల్స్ మరియు టెండరు జరుపు అధికారి
1. ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు Q.A&Q.C కడప	కడప, కర్నూలు	డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు సబ్-డివిజన్,Q.A&Q.C, కడప-I, కడప.
2. డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు Q.A&Q.C సబ్-డివిజన్, కడప-I,	కడప డివిజన్	
3. డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు Q.A&Q.C సబ్-డివిజన్, కడప-II,	రాజంపేట డివిజన్	డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు సబ్-డివిజన్,Q.A&Q.C, కడప-II, కడప.
4. డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు Q.A&Q.C సబ్-డివిజన్, జమ్మలమడుగు	జమ్మలమడుగు డివిజన్	డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు Q.A&Q.C,సబ్-డివిజన్, జమ్మలమడుగు కడప జిల్లా.
5. డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు Q.A &Q.C సబ్-డివిజన్, పులివెందుల	పులివెందుల డివిజన్	డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు Q.A &Q.C, సబ్-డివిజన్, పులివెందుల, కడప జిల్లా.

టెండరు షెడ్యూలు : 18.06.2024 టు 24.06.2024
టెండరు తేది : 25.06.2024 ఉ॥ 10.00 గం॥ల నుండి మ॥ 1.00 గం॥ల వరకు
టెండరు తెరుచు సమయం : 25.06.2024వ తేది మ॥ 3.00 గం॥లకు
టెండరు వేయదలచిన వారు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు Q.A &Q.C డివిజన్ కడప పేరు మీద రూ.500/-డి.డి.తో పై తెల్పిన అధికారిని సంప్రదించవలెయును.

డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు
Q.A &Q.C., సబ్ డివిజన్, కడప-I, కడప జిల్లా.